# ఓ క్లియరెన్స్ సేల్ కథ!



వి.వి.సుబ్బరాజు

'నిదానమే ప్రధానం!' అన్న పెద్దోళ్లే 'అలస్యం అమృతం విషం!' అని కూడా అన్నారు.

'మొదటి మాట నమ్మి దెబ్బతిన్నోడు రెండో మాట కరెక్ట్ అనుకుంటాడు. రెండో మాటకు దెబ్బయిపోయినోడు మొదటి మాట కరెక్ట్ అనుకుంటాడు' అన్నాడు బస్సా సింహాద్రి తాను చెప్పబోయే కథకి నాందిగా.

మెయిన్ రోడ్డు కాలవ పక్కనే పెద్ద మర్రి చెట్టు. ఆ పక్క విశాలమైన అరుగుల అమ్మోరి గుడి. రైతులు కూర్చుని వున్నారు. బంగాళాఖాతంలో వాయుగుండం... ఈదురుగాలులు వీస్తున్నాయి. ఆకాశం దట్టంగా మబ్బులు కమ్ముకొని వుంది. చిరుజల్లులు పడుతూనే వున్నాయి. మధ్యమధ్య పెరగడం, తగ్గడం... వర్షం ఆపు వేయకుండా వుంది. అసలు ఈ వర్షం ఎప్పటికైనా తగ్గుతుందా అన్నట్లుగా వుంది. పని పాటలకు వాతావరణం వీలుగాలేదు. అంతా తీరికగా అమ్మోరి గుడి అరుగుమీదికి చేరారు.

బాబూరావు, రంగయ్య సంచులు చింపి, బరకాలు కుట్టే పని చేస్తున్నారు. రాఘవ, కిట్టమ్మ, కేదారి పిండి సంచులు చీరి, పశువులకు డొక్కతాళ్లు వెయ్యడానికి పురిపెడుతున్నారు. వెనుకపక్క కుర్రాళ్లు పులి–మేక ఆడుకొంటున్నారు. ఆ పక్క కొందరు కుర్రాళ్లు సినిమా కబుర్లు చెప్పుకుంటున్నారు. మరికొంతమంది తీరిగ్గా బస్సా సింహాద్రి చెప్పే ఊసులు వినడానికి చుట్టూ కూర్చున్నారు. ఎవరు ఏపనిలోవున్నా అందరి చెవులూ మాత్రం సింహాద్రి కబుర్ల మీదనే వున్నాయి.

చినుకులకు తడవకుండా నెత్తిమీద తువ్వాలు చెంగులను సాగదీసి పట్టుకొని చిన్నగా పరిగెడుతూ అక్కడికొచ్చాడు శాకా శీను. "రా అల్లుడా! రా! మా అన్నయ్య యిచ్చిన చుట్టొకటి యిలా అందుకో!" అన్నాడు బస్సా సింహాద్రి శీనుకి ఆహ్వానం పలుకుతూ.

"మీ బస్సా వోళ్ల బడాయికి చుట్టొకటి! పిల్లనిచ్చి చేతులు దులిపేసుకున్నాడు మీ అన్న! యింక మిమ్మల్ని భరించడమే మాకు శిక్ష!" అంటూ నవ్వేసి సింహాద్రి చేతికి చుట్ట అందించాడు శాకా శీను.

"మీ మామా అల్లుళ్ల ఎకసెక్కాలు ఎప్పుడూ వుండేయే. సంగతి చెప్పెభా!" సింహాద్రిని విసుక్కున్నాడు బండరాముడు. బస్సా సింహాద్రి చుట్ట ముట్టించి చుట్టూ చూసాడు. జనం ఆసక్తిని గమనించి కథలోకి వచ్చేసాడు.

"మా శీల ముత్యంబావ, మంగప్పలకి ఒక్కగానొక్క కొడుకు కొండబాబు. చాలా తెలివైనోడు. చదువులో ఎప్పుడూ ఫస్టే. ఇంజనీరింగ్ చదువుతుండగానే ఓ పెద్ద కంపెనీలో వాళ్లు వాడి చదువు చూసి, ముచ్చటపడిపోయి పెద్ద జీతంతో ఉద్యోగం యిచ్చేసారు.

మంచి కంపెనీ, మంచి జీతం, మంచి కుర్రాడు. ఆస్తి పాస్తులున్నాయి. కుర్రాడు ఎర్రగా బుర్రగా బావుంటాడు. హోల్‌మొత్తంగా ఆడపిల్లలు కోరుకునే మంచి లక్షణాలన్నీ కొండబాబులో వున్నాయి. దాంతో మా ముత్యంబావని, మంగప్పనీ ఊపిరిసలపకుండా పట్టుకున్నారు ఆడపిల్లల వాళ్లు.

"అయ్యో! పనోడు, ఆడికి అప్పుడే పెళ్లేంటి? ముందుకు చూద్దాం!" అనేసి తిరగగొట్టేసారు వచ్చిన సంబంధాల్ని. వచ్చిన సంబంధాల గురించి, యిస్తామన్న కట్నాల గురించి మా ముత్యంబావ గొప్పగా అందరికీ చెబుతూ వుండేవాడు.

మళ్లా ఏడాదికి పెళ్లిళ్ల సీజను వచ్చేసరికి

కట్నాలరేట్లు విపరీతంగా పెరిగాయి. మార్కెట్ చాలా బావుంది. పోనీ కొండబాబుకీ ఓ మాట చెప్పి చూద్దాం అనుకొని వస్తున్న సంబంధాలు, కట్నాల బోగట్టా మాముత్యంబావ, మంగప్ప కొండబాబుకి ఏకరువుపెట్టారు. నేను పరీక్షలకు తయారవుతున్నాను, యిప్పుడు కాదనేసాడు. వచ్చినోళ్లకి అదే ముక్క చెప్పేసి పంపించేసారు.

మా ముత్యంబావకి, మంగప్పకి కూడా కాస్త నిదానంగా చేస్తేనే బావుంటుందన్నది లోపల ఆలోచన. కొండబాబు ఉద్యోగంలో ఒక్కో మెట్టు ఎగబాకుతాడు. జీతం పెరుగుద్ది. దాన్ని బట్టి కట్నం కూడా పెరుగుద్ది అన్నది వాళ్ల ఆశ. వాళ్ల ఆశకు, ఆలోచనకు తగ్గట్టుగానే కొండబాబు జీతం పెరిగింది. హోదా పెరిగింది. మా ముత్యం బావ స్థలాలు, పొలాలూ కొనేసాడు. యింటి ముందో కారుని, డ్రైవర్నీ నిలేసాడు. ముత్యం బావ హోదా పెరిగింది. మార్కెట్‌ని పెంచుకోవడానికి కొండబాబుకి పెరిగిన జీతం, పంపిన డబ్బుల గురించి, కొన్న ఆస్తుల గురించీ చుట్టాలకు అందరికీ ఫోనులు చేసి మరీ ఎప్పటికప్పుడు చెబుతూనే ఉండేవాడు. ఊరోళ్లకి సరేసరి. అంతా కొండబాబు లాంటి యోగ్యుడైన కొడుకు వుంటే బావుండునని అనుకునేవారు. అదే ముక్క మా ముత్యం బావ దగ్గర, మంగప్ప దగ్గర అనేవారు. ఆ మాటలకు వాళ్లు సంబరపడిపోయేవారు.

మళ్లీ పెళ్లిళ్ల సీజను మొదలయింది. ఆడపిల్లలవాళ్లు కోట్లుదాటిన ఆఫర్లతో ముందుకువచ్చారు. కొండబాబు "కంపెనీ పనిమీద అమెరికా వెడుతున్నాను, యిప్పుడుకాదు" అనేసాడు.



ప్రజాసాహితి వేదిక - విజయవాడ ప్రతినెల మూడవ ఆదివారం నిర్వహిస్తున్న సాహిత్య సభల్లో భాగంగా కె. ఆంజనేయకుమార్ కవితా సంపుటి "మీకు దగ్గర్లోనే..." ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవి డా॥ నందిని సిధారెడ్డి. చిత్రంలో ఎడమనుంచి వరుసగా కవి కె. ఆంజనేయ కుమార్, ప్రజాసాహితి ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు, ఆవిష్కర్త డా॥ నందిని సిధారెడ్డి.

మరో సీజన్‌లో 'టీమ్ లీడరుగా ఇంగ్లాండు వెళుతున్నాను. ప్రమోషన్ వచ్చింది. సెలవు దొర కదు' అంటూ కొండబాబు పెళ్లిని వాయిదా వేస్తూ వస్తున్నాడు. వాడికి డబ్బు యావేగానీ పెళ్లియావ వున్నట్టుగా లేదు.

మొన్న తాజా సీజన్ వచ్చేసరికి మా ముత్యం బావ గడప తొక్కిన ఆడపిల్ల తండ్రే లేడు! మా ముత్యంబావకి కంగారు పట్టుకుంది. 'దేశంలో ఆడపిల్లల కరువుగానీ వచ్చిందా? ఏంటీ? యీ విడ్డూరం!' అని చిన్నబోయి నాబోటిగాడ్ని లోపా యికారిగా బోగట్టా చేసాడట! ఆ పెద్దమనిషి "మీ కొండబాబుకి చేద్దామనుకున్న ఆడపిల్లలు పెళ్లిళ్లు చేసుకుని, పిల్లల్నికని, యిప్పుడు కాన్వెం టు స్కూళ్లకు పంపుతున్నారు. నువ్వు గమనిం చావోలేదో! మార్కెట్‌లో నవుజుల్లాంటి లేత బెండకాయలు దొరుకుతావుంటే నీ ముదర బెండకాయని పెద్దరేటు పెట్టి ఎవడు కొంటా డు?" అంటూ కుండబద్దలు కొట్టేసాడు.

ఒక్కసారిగా మా ముత్యం బావకు గుండె దడదడలాడిపోయింది. గొంతు తడారిపోయిం ది. ఒక్కసారి కొడుకు వయసు గుడించుకునే సరికి మూడు పదులు దాటి మూడేళ్లయింది. రూపం తలచుకుంటే నెత్తిమీద జుట్టు పలచబడి వెనక్కి నడిచింది. అక్కడక్కడా తెల్లవెంట్రుకలు తొంగిచూస్తున్నాయి. చిరుబొజ్జ వచ్చింది. హోలుమొత్తంగా ముదరవాటం వచ్చేసింది. మార్కెట్ జారిపోయిందని అర్ధమయిపోయింది. 'మన కులంలో యింత వయసు వచ్చేదాకా పెళ్లికాని బికారోడు కూడా వుండడు గదా! యిప్పుడు ఏటిదారి'అని మా మంగప్ప, ముత్యం బావ నెత్తి నోరుకొట్టుకుని ఏడ్చారు.

జాతకాల వాళ్లని పిలిపించి గ్రహాలన్నింటిని తమ దోవకు తెచ్చుకోవడానికి శాంతులు, జపా

అనుబంధాలను కాపాడుకోవడానికి చిన్న ప్రయత్నం సరిపోతుంది. అనుబంధాలు, ఆత్మీ యతలూ దెబ్బతినే సమస్యలలో సగానికిపైగా సమస్యలు కేవలం ఒకరు చెప్పేది మరొకరు వినడం ద్వారా పరిష్కరించుకోవచ్చు.

లు, హోమాలు, దానాలూ భారీ ఖర్చులతో చేయించి, మార్కెట్‌ని నిలబెట్టుకునే ప్రయత్నం చేసారు. ఫలితం కనబడలేదు. రేటులో ఎంత రిబేటు యిచ్చినా ఎవరూ ముందుకురాలేదు. సీజన్లు జారిపోతున్నాయి. యింక కట్నాల గోల వదులుకొని పిల్లదొరికితే చాలు అన్న స్టేజీకి వచ్చేసారు!" అగాడు బస్సా సింహాద్రి.

"క్లియరెన్స్ సేల్‌కి పెట్టేసారన్నమాట!" అన్నాడు శాకా శీను. "మీ ముత్యం బావ ఎదు రుకట్నం ఏ పాటిత్తాడో తెలుసుకోలేకపోయి నావా?" అన్నాడు తూర్పు అప్పన్న. జనం ఫక్కుమన్నారు. "యివ్వకేటిచేత్తడు! కొడుక్కి పెళ్లిసెయ్యాలగదమరి!" అదే యాసలో వెక్కి రిస్తూ పైకి లేచాడు బస్సా సింహాద్రి.

"ఆలస్యం అమృతం కాదు. విషం అయ్యిం దన్నమాట! ఏ వయసు ముచ్చట ఆ వయస్సులో తీర్చుకోవాలన్నారు పెద్దలు!" కథలోని నీతి చెబు తున్నట్లుగా అన్నాడు బండరాముడు.

"మీలో ఎవరైనా మా ముత్యంబావ కొడుక్కు పిల్లను చూసి పుణ్యం కట్టుకోండి బాబుల్లారా!" అంటూ బహిరంగ అభ్యర్ధన చేసాడు బస్సా సింహాద్రి.

"గొప్ప క్లియరెన్స్ సేల్! త్వరపడండి! త్వర పడండి!" అన్నాడు మళ్లీ శాకా శీను. వంత పాటకు అంతా గొల్లుమని నవ్వారు.

వర్షం తగ్గడంతో అంతా పొలందారి పట్టా రు.